క్లుప్తంగా

గంగమ్మ దేవతకు పొంగళ్లు



బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని నీర్పాకోట ఎస్సీకాలనీలోని గంగమ్మ దేవాలయంలోని అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకం అనంతరం సుందరంగా అలంకరించారు. గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో గ్రామస్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

హెచ్ఎంకు ఉద్యోగ విరమణ సన్మానం



సత్కారం అందుకున్న రాజశేఖర్ దంపతులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి జెడ్పీ ఉన్నత ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌ను స్వచ్ఛంద ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం, సహచర ఉపాధ్యాయులు సన్మానించారు. రమేష్‌బాబు దంపతులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. పలువురు మాట్లాడుతూ అంకితభావంగా పనిచేశారని ఆయన సేవలను కొనియాడారు.

కాజ్‌వేను నిర్మించండి



కాజ్‌వే లేని చీటికాలువ

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని సిద్దేశ్వరపురం గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న చీటి కాలువకు కాజ్‌వే లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చీటి కాలువపై కాజ్‌వే లేకపోవడంతో గ్రామంలోకి ఆటోలు, ద్విచక్ర వాహనాలు రాలేక నానా అవస్థలు పడుతున్నారు. వర్షకాలం చీటికాలువలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆ సమయంలో గ్రామస్తులు కాలువను దాటలేకపోతున్నారు. కాజ్‌వే కోసం 30 సంవత్సరాలుగా అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోనే నాథుడే లేరని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి కాజ్‌వేను నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడికి గాయాలు



గాయపడిన కేశవులు

ఏర్పేడు: మండలంలోని జంగాలపల్లెకు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. సీఐ శ్రీరామశ్రీనివాసులు అందించిన వివరాలు.. మండలంలోని ఆమందూరు పంచాయతీ బాలకృష్ణాపురం ఎస్టీ కాలనీకి చెందిన కేశవులు(34) ఐఐటీ తిరుపతిలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఆయన కుటుంబ సభ్యులతో కారులో వెంకటగిరికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. జంగాలపల్లి సమీపంలో కారును లారీ ఢీని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో కేశవులు గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

పిచ్చాటూరు: స్థానిక పులికుండ్రంలో ఆదివారం వేకువజామున ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో కేశవులు అనే వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. మండలంలోని వెంగళత్తూరు గ్రామానికి చెందిన వెంకటేశులు తన ట్రాక్టర్‌ను నడుపుకుంటూ పులికుండ్రం వైపు వేగంగా వెళుతున్నాడు. కేశవులు ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఆపి ఇంత వేగంగా వెళితే ప్రమాదాలు జరగవా.. నెమ్మదిగా వెళ్లు అని వెంకటేశులును మందలించాడు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం ఏర్పడింది. ఈ క్రమంలో రెంచ్‌తో వెంకటేశులు దాడి చేయడంతో కేశవులు గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వెంకటేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

సిద్ధ ఆయుర్వేద యోగా ఉచిత వైద్య శిబిరం

తిరుపతి కల్చరల్: సేవా భారతి స్వచ్ఛంద సంస్థ, కేసువ సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో రైల్వేకాలనీలోని సరస్వతి శిశుమందిర్‌లో ఆదివారం కేరళ రాష్ట్రం నుంచి విచ్చేసిన సిద్ధ ఆయుర్వేద వైద్యులతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శిబిరానికి విచ్చేసిన వారికి వైద్యులు ఆరోగ్య సమస్య ఉన్నవారిని పరీక్షించి, చికిత్స అందించారు.

జగనన్న పాలనకే ప్రజలు మొగ్గు

- పేదలు, మహిళల సంక్షేమమే ధ్యేయం
- వైఎస్సార్‌సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్



రామచంద్రాపురంలో పథకాల లబ్ధిని వివరిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్

సత్యవేడు: ఐదేళ్ల సంక్షేమ పాలన అందించి ప్రజల హృదయాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుస్థిర స్థానం సంపాదించుకున్నారని, మళ్లీ జగన్‌మోహన్ రెడ్డి పాలన రావాలనే ప్రజలు ఆకాంక్షిస్తున్నారని వైఎస్సార్‌సీపీ సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్ తెలిపారు. మండలంలోని ఆరూరు, ఆరూరు కండ్రిగ, రామచంద్రాపురం, మల్లవారిపాళెం వెస్టు చెంగంబాకం, గొల్లవారిపాళెం, అప్పయ్యపాళెం, మల్లవారిపాళెం వెస్టు, చెరివి, మాదనపాళెం, చిగురుపాళం గ్రామాల్లో పార్టీ నాయకులతో కలసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా తామంతా జగనన్న వెంటే అని ప్రజలు ముక్తకంఠంతో చెప్పారు. తొలుత ఆరూరులో మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గురుమూర్తిని గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం దళితవాడలో ప్రసంగిస్తూ జగనన్న పాలన, చంద్రబాబుపాలనకు తేడా గమనించాలని కోరారు. పేదలు, మహిళల అభివృద్దే లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో ఇంతగా సంక్షేమ పథకాలు అందించిన ప్రభుత్వం లేదని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరో సారి సీఎంగా చేయాలని, సంక్షేమ పాలనకు అన్నివర్గాల ప్రజలు మద్దతు తెలపాలని కోరారు. ప్రస్తుత ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్నాయన్నారు. పేదలకు మేలు చేసే జగనన్నకు తోడుగా నిలవాలని కోరారు

వలంటీర్ల సేవలను ఈసీ ద్వారా నిలుపుదల

ప్రజలకు మంచి చేయాలని జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు తెస్తుంటే , టీడీపీ నాయకుడు చంద్రబాబు కోర్టులద్వారా అడ్డుకొనే ప్రయత్నాలుచేస్తునే ఉన్నారని ఆరోపించారు. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దకు వెళ్లి వలంటీర్లు పింఛన్లు ఇవ్వకూడదని ఈసీ ద్వారా చంద్రబాబు అడ్డుకునే యత్నం చేశారని అన్నారు. అధికారంలోకి రాక ముందే పేదలను ఇబ్బందులు పెడుతున్న చంద్రబాబు కుటిలబుద్ధిని ప్రజలు గుర్తించాలన్నారు. ఈకార్యక్రమాల్లో పార్టీ తాడిపత్రి పరిశీలకుడు బీరేంద్ర వర్మ, మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కె.నిరంజన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, మాజీ చైర్మన్ ఏపీఎం బుజ్జిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ బి.సోమశేఖర్, జిల్లా మహిళ నాయకురాలు మస్తానీ, యువత మండల అధ్యక్షుడు వంశీరెడ్డి, వ్యవసాయ కమిటీ అధ్యక్షుడు కె.శ్యాంప్రసాద్ హరెడ్డి, ఆస్పత్రి కమిటీ సభ్యుడు గోవిందస్వామి, నాయకులు రఘుపతి రెడ్డి, పగడాల రమేష్, ఆరూరు శేఖర్, కమల్, రామయ్య, పరందాం, ఉమాపతి, సురేంద్ర, సంజయ్ రెడ్డి, సన్యాసయ్య, జి.మునికృష్ణయ్య, మునస్వామి, అశోక్, శేఖర్, రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆరూరులో ఆత్మీయ స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

వైఎస్సార్‌సీపీ గెలుపునకు సహకరించండి



పీవీఆర్ కుటుంబ సభ్యులతో సమావేశమైన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పట్టణ ప్రముఖులు పీవీఆర్ కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి పార్టీ నాయకులతో కలసి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో అధిక ప్రజాధారణ ఉన్న మీ సహకారం వైఎస్సార్ సీపీకి అవసరమని కోరారు. స్పందించిన జనార్ధన్‌రావు పవార్ మాట్లాడుతూ తమ సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీవీఆర్ కుటుంబ సభ్యులు పరమేశ్వర్‌రావు పవార్, రాజారాం పవార్, సిద్దు పవార్, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, టౌన్ బ్యాంకు చైర్మన్ శెట్టిపల్లి సురేష్, నరసింహులు, రమణమూర్తి, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ ఆర్కాట్ శేఖర్ పఠాన్ పరీద్, రత్నంరెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ లోకేష్‌యాదవ్, కొళ్లూరు హరినాథ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని 36 చర్చిల్లో ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. పాస్టర్లు సందేశమిస్తూ యేసుక్రీస్తు లోక రక్షనార్థమై శిలువపై ప్రాణాలు అర్పించి మూడో రోజుతాను మీకోసం సజీవంగా ఉన్నానని పునరుర్థానుడయ్యారని తెలిపారు. ప్రభువు సూక్తులను అనుసరిస్తూ సన్మార్గంలో నడవలన్నారు. ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జీవించాలని, పరస్పరం కష్ట, సుఖాల్లో పాలుపంచుకోవాలని సూచించారు. పెద్దల సమాధులపై పూలమాలలు వేసి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తి గీతాలను అలపించారు.



బీఎన్‌కండ్రిగ: సమాధుల వద్ద ప్రార్థన

ఏర్పేడు మండలంలో..

ఏర్పేడు: మండలంలోని చర్చిల్లో ఆదివారం ఈస్టర్ డేను ఘనంగా నిర్వహించారు. ఏసుక్రీస్తు పునరుర్థాన పవిత్ర దినం కావడంతో క్రిస్టియన్‌లు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాతవీరాపురం ఎస్టీ కాలనీ, ఏర్పేడు, కృష్ణగిరి కాలనీ, మేర్లపాక తదితర చర్చిల్లో పాస్టర్లు ఈస్టర్‌డే విశిష్టతను వివరించారు.

టీడీపీ, జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



బియ్యపు పవిత్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన జనసేన, టీడీపీ కుటుంబాలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి ఎస్టీకాలనీలో ఆదివారం టీడీపీ, జనసేన నుంచి భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి అక్కుర్తి ఎస్టీకాలనీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన టీడీపీ, జనసేనకు చెందిన 27 కుటుంబాలకు చెందిన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి పవిత్రారెడ్డి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి తమవంతు కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. పార్టీలో చేరినవారిలో రెడ్డెయ్య, మహేష్, రామమూర్తి, చలపతి, మణి, జగదీష్, సాల్మన్, శివ, కాటయ్య, పున్నయ్య, పోలయ్య, గంగయ్య, రమణ, ఎస్టీ సెల్ నాయకుడు దాసా సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

అందుబాటులో ఉండే వారినే ఆదరించండి



గొల్లపల్లె ప్రచారంలో బియ్యపు శ్రీవాణిరెడ్డి

రేణిగుంట: నియోజకవర్గ ప్రజలకు ఐదేళ్లపాటు అందుబాటులో ఉంటూ అండగా నిలిచిన బియ్యపు మధుసూదన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సతీమణి శ్రీవాణిరెడ్డి కోరారు. ఆదివారం సాయంత్రం రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ దొడ్లమిట్ట, అరుంధతీవాడ, రాజీవ్‌గాంధీ కాలనీ, దళితవాడ, గొల్లపల్లె, చెంగారెడ్డిపల్లెలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, భారీ బాణసంచా పేల్చుతూ, పూల వర్షం కురిపిస్తూ ఆయా గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఆమె ఇంటింటికీ వెళ్లి నాలుగన్నరేళ్లలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల బుక్‌లెట్‌లను పంచుతూ లబ్ధిని వివరించారు. 30ఏళ్లుగా వెనుకబడి ఉన్న శ్రీకాళహస్తిని అభివృద్ధిపథంలో నడిపించిన మధుసూదన్‌రెడ్డిని మరోసారి ఎమ్మెల్యే గెలిపించుకుంటే మరింత అభివృద్ధి చేస్తారని తెలిపారు. కరోనా కష్టకాలంలో నియోజకవర్గ ప్రజలకు తోడుగా ఎవరున్నారో.. పక్కరాష్ట్రాల్లో ఎవరు దాక్కున్నారో ప్రజలు ఆలోచించాలన్నారు. ప్రతిపక్ష పార్టీలు గెలిస్తే వారిని కలవాలంటే పక్క రాష్ట్రానికి వెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, పేదరిక నిర్మూలనే ధ్యేయంగా అర్హులందరికీ జగనన్న పాలనలో పారదర్శకంగా పథకాలు అందాయని గుర్తుచేశారు. ఈ పాలనలో లబ్ధి పొందిన ప్రతి ఒక్కరూ అండగా నిలిచి, మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటే పేదల సంక్షేమం మరింత అద్భుతంగా కొనసాగుతుందన్నారు. ఎంపీపీ కలపాటి హరిప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గంగారి రమేష్, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జువ్వల దయాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, రైతు సలహా మండలి నియోజకవర్గ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, మన్యం శ్రీనివాసులురెడ్డి, సందీప్‌రెడ్డి, సర్పంచ్ ఈశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు శ్రావణి, కేశవయ్య, యుగంధర్, మునిప్రసాద్, లోకేష్‌యాదవ్, గోపాల్, వెంకటముని, పట్టాభిరెడ్డి, ఎంపీటీసీ శశికిరణ్, కోఆప్షన్ సభ్యుడు హసన్, నగేషం, మునిశేఖర్‌రెడ్డి, అబ్దుల్ ఖదీర్, అరుణాదేవి, బుజ్జమ్మ, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



పథకాల లబ్ధిని వివరిస్తున్న శ్రీవాణిరెడ్డి

నవోదయలో విద్యార్థుల ప్రతిభ



జాను (శ్రీకాళహస్తి)



సాత్విక్ (వరదయ్యపాళెం)



పూవరసి (పిచ్చాటూరు)

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న గంధం జాను జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికైనట్లు హెచ్‌ఎం రాంబాబు తెలిపారు. బాలికను ఉపాధ్యాయులు అభినందించారు.

పిచ్చాటూరు: పిచ్చాటూరుకు చెందిన ఎలక్ట్రిషియన్ కుమార్తె ఎ.పూవరసి నవోదయ పాఠశాలలో 9వ తరగతి అడ్మిషన్‌కు ఎంపికైయ్యింది. ఆదివారం నవోదయ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. విద్యార్థిని తండ్రి సాధారణ ఎలక్ట్రిషియన్ కాగ, తల్లి గృహిణి. పూవరసిని 8వ తరగతి చదువుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 10న జరిగిన జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష రాసింది. ఉత్తమ మార్కులు సాధించడంతో మదనపల్లె నవోదయలో 9వ తరగతి ప్రవేశానికి అర్హత సాధించింది. బాలికను ఉపాధ్యాయులు అభినందించారు.

వరదయ్యపాళెం: జవహర్ నవోదయ పాఠశాలకు వరదయ్యపాళెంకు చెందిన సాత్విక్ ఎంపికయ్యాడు. ఉత్తమ ఫలితాలు సాధించి నవోదయ ఆరవ తరగతి ప్రవేశానికి అర్హత పొందాడు. విద్యార్థి చోళాఅగ్రహారంలో ఐదవ తరగతి చదువుతుండగా, ఆయన తండ్రి తిరుపతి నాయుడు సైతం అదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. విద్యార్థిని ఉపాధ్యాయులు అభినందించారు.

పారిజాత పర్వం చిత్రం యూనిట్ సందడి



పారిజాత పర్వం చిత్రం యూనిట్, హీరోయిన్ శ్రద్ధాదాస్ తదితరులు

తిరుపతి కల్చరల్: పారిజాత పర్వం చిత్రం యూనిట్ ఆదివారం తిరుపతిలో సందడి చేసింది. ఆ చిత్రం విడుదల నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఓ ప్రైవేట్ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పారిజాతపర్వం చిత్రం విశేషాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఈ చిత్రం హీరోలు చైతన్య, వైవా హర్ష మాట్లాడుతూ కిడ్నాప్ డ్రామా, క్రైంతో నడుస్తూ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించే చిత్రమని తెలిపారు. సినిమా ఈ నెల 19వ తేదీన దేశవ్యాప్తంగా విడుదలవుతోందని తెలిపారు. సినిమా హీరోయిన్ శ్రద్ధాదాస్ మాట్లాడుతూ కొంత గ్యాప్ తర్వాత తెలుగు సినిమాలో పూర్తి స్థాయిలో తాను నటించానన్నారు. అనంతరం అభిమానుల సెల్ఫీలతో చిత్రం యూనిట్ సందడి చేసింది.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు సేవా ఏటీసీహెచ్ వరకు బారులు తీరారు.శుక్రవారం అర్ధరాత్రి వరకు 79,907 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 34,037 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.4.05 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

చిరస్మరణీయులు సముద్రాల లక్ష్మణయ్య



స్మారక సంచికను ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి కల్చరల్: సంస్కృత పాండిత్యంతో, అపార మేధా సంపత్తితో అనేక సంస్కృత గ్రంథాలను సరళమైన తెలుగు భాషలోకి అనువదించిన మహా మహోపాధ్యాయుడు సముద్రాల లక్ష్మణయ్య చిరస్మరణీయులని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఉద్ఘాటించారు. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా రూపొందించిన సముద్రాల లక్ష్మణయ్య స్మారక సంచికను ఆవిష్కరించి, ప్రసంగించారు. సముద్రాల సంచికను చదివానని, అందులోని ఛాయా చిత్రంలో నలుగురు కార్యదర్శులు వెనుక భాగాన ఉండడం గమనించి, ఆయనకు ఇదే సరైన గౌరవమని సంతృప్తి చెందానని తెలిపారు. తాను టీటీడీ చైర్మన్ అయ్యాక సముద్రాల లక్ష్మణయ్యను సేవలను వినియోగించుకుంటూ తగిన గౌరవ స్థానం కల్పించాలని భావించేవాడినని, దురదృష్టవశాత్తు ఆ అవకాశం దక్కలేదని భూమన పేర్కొన్నారు. సహస్రావధాని డాక్టర్ మేడసాని మోహన్, వశిష్ట ఆశ్రమం స్వరూపానందస్వామి, ఏర్పేడు ఆశ్రమం సంపూర్ణానందస్వామి, సముద్రాల లక్ష్మణయ్య కుటుంబ సభ్యులు అంజమ్మ, అరుంధతి, సాధామణి, సీపీఎం నేత కందారపు మురళి, వేమన విజ్ఞాన కేంద్రం ప్రతినిధి నాగార్జున, పలువురు సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎంపిక



ఆర్య వైశ్య సంఘం నూతన కమిటీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: తిరుపతి మహానగర ఆర్య వైశ్య సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎంపిక చేశారు. ఈ మేరకు ఎంఆర్‌పల్లి వైదిక భవన్‌లో ఆ సంఘం ఎన్నికలు నిర్వహించారు. ఇందులో భాగంగా తిరుపతి మహానగర అర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పామిడి సత్యనారాయణ శెట్టి, కార్యదర్శిగా కొండూరు మహేష్, కోశాధికారిగా ఎస్.శిరీష మంజునాథ్, సహాయ కోశాధికారిగా కామిశెట్టి కృష్ణమూర్తి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ప్రస్తుత సంఘం అధ్యక్షుడు పసుపర్తి గోపినాథ్‌ను గౌరవాధ్యక్షుడిగా కొనసాగిస్తూ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

● పంట పండింది..



ఏర్పేడు మండలంలో వరి ఒబ్బిళ్లలో రైతులు నిమగ్నమయ్యారు. ఈ రబీ సీజన్‌లో రైతులు 5,670 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎక్కువగా మూడు నెలలకు దిగుబడి వచ్చే ఆర్ఎన్ఆర్- 15048, బీపీటీ-5204 రకాలను వేశారు. వరికోత యంత్రాల కొరత ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సకాలంలో ఒబ్బిళ్లు చేయకుంటే దిగుబడులు తగ్గిపోతాయని ఆందోళన చెందుతున్నారు. ఎకరాకు 30 నుంచి 35 బస్తాల దిగుబడి వస్తోంది. ఎకరా సాగుకు రూ.15 వేల వరకు పెట్టుబడి పెట్టారు. మార్కెట్‌లో ధాన్యం ధర 75 కిలోల బస్తా రూ.2 వేలు పలుకుతుండడంతో రైతుల కళ్లలో ఆనందం వెల్లివిరుస్తోంది. దళారులు రైతుల నుంచి బస్తా రూ.1700 నుంచి రూ.1800కి కొనుగోలు చేస్తున్నారు. -ఏర్పేడు